నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 నిజామాబాద్ శనివారం 20 ఏప్రిల్ 2024 ADILABAD NIRMAL

# సివిల్స్ ర్యాంకర్ శుభమ్‌కు ఘన స్వాగతం



రేకులవార్ శుభమ్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఇంద్రవెల్లి, ఏప్రిల్19 : యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 790 ర్యాంకు సాధించిన రేకులవార్ శుభమ్‌కు శుక్రవారం గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఫలితాలు వెలువడిన అనంతరం మొదటి సారిగా తన స్వగ్రామం ముత్నూర్‌కు శుక్రవారం వచ్చిన రేకులవార్ శుభమ్‌కు యువకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అభినందనలు తెలుపుతూ శాలువాలతో సన్మానించి మిఠాయిలు తినిపించారు. అనంతరం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, గుట్టపైనున్న దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

# బాసరలో భక్తుల సందడి

బాసర, ఏప్రిల్ 19 : బాసరలోని జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో భక్తుల సందడి నెలకొన్నది. శుక్రవారం అమ్మవారి దర్శనం కోసం తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో క్యూలైన్‌లో రద్దీ కనిపించింది. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి, ప్రత్యేక పూజలు చేశారు.



చిన్నారితో అక్షరాభ్యాసం చేపిస్తున్న అర్చకుడు



పిప్పర్‌వాడ చెక్‌పోస్టు వద్ద కారును తనిఖీ చేస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

# మహారాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల తనిఖీ

ఎదులాపురం/జైనాథ్, ఏప్రిల్19: మహారాష్ట్రలో ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్ర సరిహద్దులో ఉన్న మూడు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ, ఆనంద్‌పూర్ చెక్‌పోస్టుల వద్ద మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్‌కు రాకపోకలు సాగించే వాహనాలను తనిఖీ చేశారు. రూ.50వేల కన్నా ఎక్కువ నగదును తీసుకొని వస్తే అందుకు సంబంధించిన పత్రాలు, రసీదులు కలిగి ఉండాలని సూచించారు. మహారాష్ట్రతో అనుసంధానం చేసే ఆనంద్‌పూర్ చెక్‌పోస్టు, యవత్‌మాల్ జిల్లాతో సరిహద్దును పంచుకునే దిగ్రస్ చెక్‌పోస్టును కూడా పరిశీలించారు. అనంతరం చంద్రపూర్ జిల్లాతో సరిహద్దుతో ఉన్న శంకర్‌గూడ , పరసోడా చెక్‌పోస్టులను పరిశీలించారు. ఇప్పటివరకూ జిల్లా వ్యాప్తంగా సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.34,48,060 నగదును స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఎస్పీ వెంట సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వీ.శ్రీకాంత్, డిప్యూటీ కమాండెంట్ స్వప్నిల్ పవర్, జైనథ్ ఎస్‌ఐ వీ.పురుషోత్తం సిబ్బంది ఉన్నారు.

# మానని గాయం

**ఇంద్రవెల్లి ఘటనకు నేటితో 43 ఏళ్లు**

- నేడే అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- నివాళులర్పించేందుకు సిద్ధమైన ఆదివాసీలు
- ఏర్పాట్లు పూర్తి.. పోలీసుల భారీ బందోబస్తు

ఇంద్రవెల్లి, ఏప్రిల్19 : 1981 ఏప్రిల్ 20.. హక్కుల కోసం అడవిబిడ్డలంతా ఒక్కటై చీమలదండులా ఇంద్రవెల్లి బాట పట్టారు. పోలీసుల ఆంక్షలు, హెచ్చరికలను ఏమాత్రం పట్టించుకోలేదు. చిన్నపాటి ఘర్షణలో ఓ జవాను మృతి చెందగా, ఒక్కసారిగా రెచ్చిపోయిన ఖాకీలు గుళ్ల వర్షం కురిపించారు. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు ఏకంగా 13 మంది పట్టల్లా (అనధికారికంగా 60 మంది) రాలిపోయారు. నేటితో సరిగ్గా 43 ఏళ్లు పూర్తవుతుండగా, ఆ గాయాలు ఇంకా ఆదివాసులను వెంటాడుతూనే ఉన్నాయి. నేడు పోరుగడ్డలో సంస్మరణ దినోత్సవం నిర్వహించనుండగా, ఆనాటి అమరులకు నివాళులర్పించేందుకు ఆదివాసులు సిద్ధమయ్యారు.

## స్వరాష్ట్రంలో ఆంక్షల సడలింపు..

అమాయక గిరిజనుల నెత్తురు చిందిన ఇంద్రవెల్లి ఘటనకు నేటితో 43 ఏళ్లు పూర్తయ్యాయి. 1981, ఏప్రిల్ 20న జరిగిన ఘటనను ఇక్కడి ఆదివాసీ గిరిజనులు ఎన్నటికీ మరువలేరు. స్వరాష్ట్రంలో పోలీసులు ఆంక్షలు సడలింపు చేయడంతో ఆదివాసీ గిరిజనుల ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ అమరవీరులకు స్వేచ్ఛగా నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటిస్తున్న విషయం తెలిసిందే. పోలీసుల ఆంక్షలతో కూడిన అనుమతి లభించడంతో అమరవీరుల స్తూపం వద్ద స్వేచ్ఛగా



ముస్తాబైతున్న అమరవీరుల స్తూపం

నివాళులర్పించేందుకు గిరిజనులు అన్ని విధాలా సిద్ధమయ్యారు. యేటా ఏప్రిల్ 20న అమరవీరుల స్తూపం వద్ద పోలీసులు విధించే 144 సెక్షన్‌ను పూర్తిగా సడలింపు చేశారు.

## ఆ రోజు జరిగింది ఇది..

సీమాంధ్ర ప్రభుత్వాల హయాంలో బుక్కెడు బువ్వ కోసం పడరాని పాట్లు పడుతున్న గిరిజనులు జల్, జంగిల్, జమీన్.. హక్కులు సాధించుకోవడం కోసం ఉద్యమించిన అడవిబిడ్డలపై అప్పటి సర్కారు తుపాకీ గురిపెట్టి తూటాల వర్షం కురిపించింది. అప్పటి ప్రభుత్వ హయాంలోని పోలీసులు విచక్షణా రహితంగా జరిపిన కాల్పుల్లో అనేక మంది గిరిపుత్రులు అసువులుబాశారు. ఆ రక్తపు మరకలు ఇప్పటికీ చెరిగిపోవడం లేదు. ఈ ఘటనతో ఇంద్రవెల్లి పేరు దేశంలోనే మార్మోగిపోయింది. 43 ఏళ్ల క్రితం గిరిజనులు, వ్యాపారులు అధికారుల చేతుల్లో అనేక రకాలుగా దోపిడీకి గురయ్యారు. గిరిజనులు నోరువిప్పితే చాలు అధికారులు చావబాదేవారు. ఈ క్రమంలో నక్సలైట్ల ఉద్యమం విస్తరిస్తున్న క్రమంలో, వారిని అణచివేయడానికి గిరిజన గూడేల్లో పోలీసుల బూట్ల చప్పుళ్లు ప్రారంభమయ్యాయి. అష్టకష్టాలు పడుతున్న గిరిజనులెవ్వరూ పోరాటం చేసినా కలిసిరావడానికి సన్నద్ధమయ్యారు. ఈ తరుణంలో నక్సలైట్లు భూ పంపిణీ చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. మరోవైపు గిరిజన సంఘాలు కూడా ఈ సమస్యలపై ఆందోళనలు ప్రారంభించాయి. ఈ క్రమంలో గిరిజనులు అడవుల్లో ఖాళీగా ఉన్న భూములను దున్నడం ప్రారంభించారు. అయినా అప్పటి ప్రభుత్వం స్పందించకపోవడంతో పలు సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి 1981, ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో బహిరంగ సభ నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. దీనికి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. అయినా వెనక్కి తీసుకొనే ప్రసక్తి లేదని గిరిజన సంఘాలు ప్రకటించాయి.

## 1987లో స్తూపం పునర్నిర్మాణం

1981, ఏప్రిల్ 20న కాల్పుల్లో మరణించిన గిరిజనుల స్మారకార్థం రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో స్తూపాన్ని నిర్మించారు. కానీ 1986 మార్చి 19న గుర్తు తెలియని వ్యక్తులు ఈ స్తూపాన్ని డైనమైట్లతో కూల్చివేశారు. దీంతో అమరవీరుల స్తూపం నేలమట్టమైపోవడంతో గిరిజనుల్లో నెలకొన్న నిరాశ నిస్పృహలను తొలగించేందుకు అప్పటి ప్రభుత్వం 1987లో ప్రభుత్వ నిధులతో స్మారక స్తూపాన్ని పునర్నించింది.

## ముమ్మరంగా ఏర్పాట్లు

నేడు అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించేందుకు అమరవీరుల ఆశయ సాధన కమిటీ, రగల్ జెండా కమిటీ సభ్యులతోపాటు ఆదివాసీ గిరిజను సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. అమరవీరుల స్తూపం పరిసరాల ప్రాంతంలో భూమి చదును చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. అమరవీరుల స్తూపానికి ఎరుపు రంగు వేశారు.

## 100 మందితో బందోబస్తు..

అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 100 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ డీ సునీల్ తెలిపారు. అమరవీరుల స్తూపంతో పాటు మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో ప్రత్యేక బలగాలతో ప్రత్యేక నిఘా పెట్టినట్లు చెప్పారు. ప్రస్తుతంగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నిబంధనలు పాటించి నివాళులర్పించాలన్నారు.



తోషం తండా ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి

# అన్ని గ్రామాల్లో తాగునీరందించాలి

**- జిల్లా ప్రత్యేకాధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్**

గుడిహత్నూర్, ఏప్రిల్19 : మిషన్ భగీరథ నీరు సరఫరా కాని గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రజలకు నీరు అందజేయాలని ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేకాధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. గుడిహత్నూర్ మండలంలోని తోషం తండా, డోంగర్‌గాం గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామ పంచాయతీల్లో మే రెండో వారం వరకు అడుగంటిపోయే తాగు నీటి సరఫరా బోరు బావులను గుర్తించాలన్నారు. వ్యవసాయ బావులు, బోరు బావులను అద్దెకు తీసుకొని నీటి కొరత లేకుండా చూడాలన్నారు. ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వికాస్ మహా, మిషన్ భగీరథ ఎస్ఈ సురేశ్, ఎంపీడీవో, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీల అమలెప్పుడు..?

- కాంగ్రెస్ సర్కారుపై రైతుల ఫైర్
- సీఎం రేవంత్‌రెడ్డికి పొచ్చెర గ్రామస్తుల పోస్టు కార్డులు

బోథ్, ఏప్రిల్ 19: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇంకెప్పుడు అమలు చేస్తారంటూ కాంగ్రెస్ సర్కారుపై అన్నదాతలు సీరియస్ అయ్యారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పోస్టుకార్డు ఉద్యమానికి దిగారు. ఈ మేరకు శుక్రవారం బోథ్ మండలంలోని పొచ్చెర రైతులు, గ్రామస్తులు సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డులు రాసి నిరసన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ మేరకు తక్షణమే రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు, క్వింటాల్ ధాన్యానికి బోనస్ రూ.500 అందించాలని కోరారు. నెలకు రూ.4 వేల పింఛన్‌తో పాటు మహిళలకు ప్రతి నెలా అందిస్తామన్న రూ రూ. 2,500 సాయం, కల్యాణలక్ష్మి పథకం కింద రూ.లక్షతో పాటు తులం



సీఎంకు పంపిస్తున్న పోస్టు కార్డులను చూపిస్తున్న పొచ్చెర గ్రామస్తులు

బంగారం ఎప్పుడిస్తారని ప్రశ్నిస్తూ పోస్టు కార్డులు రాసి పంపించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటరమణారెడ్డి, బాపురెడ్డి, శమేందర్‌రెడ్డి, రాజు, నల్ల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి లచ్చన్న, సుధాంరెడ్డి, పోతారెడ్డి, మల్ల చిన్నారెడ్డి, తిరుమల్‌రెడ్డి, బద్దం రాజారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మల్లెపూల సుభాష్, భీమ బుచ్చన్న, వెంకటరమణ పాల్గొన్నారు.

## రైతులను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారు..



*బోథ్, ఏప్రిల్ 19: ఎన్నికల సమయంలో రైతులకు రూ.2 లక్షల చొప్పున రుణాన్ని మాఫీ చేస్తామని మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. డిసెంబర్ 9 తేదీ నాడే రుణమాఫీ అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. నాలుగు నెలలైనా దాని ఊసే లేదు. పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి మోసం చేయడానికి ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని సీఎం ప్రకటనలిస్తున్నారు. మరోవైపు రైతు భరోసా ఎకరానికి రూ.15 వేలు ఇస్తామన్నారు. పాత ప్రభుత్వం ఇచ్చినట్లుగా రూ.10 వేలు కూడా ఇంకా అందరి రైతులకు ఇవ్వలేదు.*

**-ఏనుగు వెంకటరమణారెడ్డి, రైతు, పొచ్చెర, బోథ్**

## ఆరు గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారు..



*ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందో గ్యారంటీ లేదు. మా రైతులకు సంబంధించి రూ.2 లక్షల రుణమాఫీ లేదు. ఎకరానికి రూ. 15 వేల రైతు భరోసా జాడలేదు. పింఛన్లు రూ.4 వేలకు పెంచుతామన్నారు. మహిళలకు ప్రతి నెలా రూ.2,500 ఇస్తామన్నారు. వాటి గురించి పట్టించుకోవడం లేదు. కల్యాణలక్ష్మి పథకం కింద రూ.లక్షతో పాటు తులం బంగారమని చెప్పి ఇప్పటికీ ఇవ్వడం లేదు. ఈ ప్రభుత్వ పనితీరుపై గ్యారంటీ లేకుండా పోయింది.*

**- ధనె నరేందర్‌రెడ్డి, రైతు, పొచ్చెర, బోథ్**



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్, అధికారులు

# అభ్యర్థుల ఖర్చులపై నిఘా పెట్టాలి

- నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకోవాలి
- ప్రత్యేక వ్యయ పరిశీలకుడు జే వివేకానంద రాజేంద్ర
- పాల్గొన్న కలెక్టర్లు, అధికారులతో వీడియోకాన్ఫరెన్స్

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 10 : పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులను ప్రతి రోజూ పరిశీలించి, వివరాలు నమోదు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రత్యేక వ్యయ పరిశీలకుడు జ్యాదవార్ వివేకానంద రాజేంద్ర సూచించారు. శుక్రవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల విభాగం అధికారులతో ఎన్నికల ఖర్చుల వివరాల నమోదు, పర్యవేక్షణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి జూన్ 4 వరకు ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచార కార్యక్రమంలో భాగంగా చేసే ప్రతి ఖర్చునూ తప్పనిసరిగా లెక్కించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణ, ఫిర్యాదులు, అక్రమంగా డబ్బు, మద్యం రవాణా నిరోధం, శాంతి భద్రతల పర్యవేక్షణ తదితర అంశాలపై సూచనలు చేశారు. ఎన్నికల ఖర్చు వివరాలను ప్రతిరోజూ పరిశీలించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు మించి ఖర్చులు ఉంటే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం నిర్మల్ కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ మాట్లాడుతూ ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల, అదనపు కలెక్టర్లు కిశోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్, ఆర్డీవోలు రత్న కల్యాణి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



సీట్లు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికను అందజేస్తున్న అధికారులు

# 'సృజన' విద్యార్థులకు అభినందన

కుంటాల, ఏప్రిల్, 19 : జవహర్ నవోదయ, ఆల్ ఇండియా సైనిక్ స్కూల్‌కు మండలానికి చెందిన సృజన విద్యానిలయంలో చదివిన విద్యార్థులు ఈ సారి పెద్ద సంఖ్యలో ఎంపిక కావడం మండలానికి గర్వకారణమని ఎంఈవో ముత్యం అభినందించారు. శుక్రవారం సీట్లు సాధించిన విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులను పాఠశాలలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రహీం, ఎస్ఐ రజినీకాంత్, ప్రధానోపాధ్యాయుడు కొత్తపల్లి గంగన్న, పోషకుల కమిటీ చైర్మన్ సబ్బిడి రాకేశ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి తరపున నామినేషన్ దాఖలు చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి

# రెండో రోజు ఒక నామినేషన్

ఎదులాపురం, ఏప్రిల్19 : లోక్ సభ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా శుక్రవారం ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి రెండవ రోజు ఒక నామినేషన్ దాఖలైందని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. కలెక్టర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన ఆర్వో కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తరపున ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలు కంది శ్రీనివాస్ రెడ్డి, ఆడె గజేందర్, సీనియర్ పాత్రికేయుడు కరీం, కాంగ్రెస్ నాయకురాలు శ్రీలేఖ కలిసి ఒక కాపీ నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు.

# వడదెబ్బతో కూలీ మృతి

దస్తురాబాద్,ఏప్రిల్19 : వడదెబ్బతో ఓ కూలీ మృతి చెందిన ఘటన దస్తురాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. మండల కేంద్రానికి చెందిన రామగిరి లక్ష్మీనర్సయ్య(48) దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. రెండు రోజులుగా నీరసంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం కూలీ పనికి వెళ్లిన చోట ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులకు గ్రామంలోని ఆర్ఎంపీ దగ్గర ప్రథమ చికిత్స చేసి అంబులెన్స్‌లో ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. ఆయనకు భార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు.



లక్ష్మీనర్సయ్య(ఫైల్)

# గంజాయి మత్తు..యువత చిత్తు..!

- పట్టణాలు, పల్లెల్లో జోరుగా గంజాయి విక్రయాలు
- సరిహద్దు రాష్ట్రాల నుంచి దిగుమతి
- లగ్జరీ కార్లలో రవాణా
- యువత, కళాశాలల విద్యార్థులే టార్గెట్‌గా దందా

నిర్మల్, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో గంజాయి దందా జోరుగా సాగుతున్నది. యువత, విద్యార్థులను టార్గెట్‌గా చేసుకొని వ్యాపారులు విక్రయాలు సాగిస్తున్నారు. జిల్లాకు ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో మహారాష్ట్ర సరిహద్దు ఉండడంతో అక్రమ రవాణాకు అడ్డాగా మారుతున్నది. నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో సైతం గంజాయి విక్రయాలు సాగిస్తున్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా పాన్ టేలాలు, బేకరీలతో పాటు బస్టాండ్ తదితర రద్దీ ప్రాంతాలు, కళాశాలలకు సమీపంలో ఈ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం. కొన్ని ప్రాంతాల్లో గంజాయి నింపిన సిగరెట్ రూ.50, గంజాయి ప్యాకెట్ అయితే రూ.100 నుంచి 200 వరకు విక్రయిస్తున్నట్లు తెలిసింది.

## ఐదు జిల్లాలకు విస్తరణ...

హైదరాబాద్, ఒడిశా, మహారాష్ట్రకు చెందిన కొందరు గంజాయి స్మగ్లర్లు ఓ ముఠాగా ఏర్పడి పెద్ద ఎత్తున ఈ దందాను కొనసాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కొద్ది రోజుల క్రితం నిర్మల్ జిల్లా కేంద్రంలో గంజాయిని సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను ఇక్కడి పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించగా గంజాయి దందా గుట్టు రట్టయింది. ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి తదితర ప్రాంతాల నుంచి గంజాయి తెస్తున్నట్లు తెలిసింది. స్మగ్లర్లు బ్రాండెడ్ దుస్తులు ధరించి, ఖరీదైన లగ్జరీ కార్లలో ప్రత్యేకంగా తయారు చేసిన బాక్సుల్లో గంజాయి ప్యాకెట్లను దాచి పెట్టి హైదరాబాద్, ఆర్మూర్, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, ఆదిలాబాద్, మంచిర్యాల వరకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు.




మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల (ఫైల్)

## జోరుగా విక్రయాలు..

పలు ప్రాంతాల్లోని మురికి వాడల్లో, శివారు ప్రాంతాల్లో రహస్యంగా గంజాయి విక్రయాలు ప్రతి రోజూ వేల రూపాయల్లో సాగుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. గంజాయిని వినియోగించవద్దని స్కూళ్లు, కాలేజీలు, గ్రామాల్లో కార్డెన్ సెర్చ్, కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలతో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు పోలీసులు నిర్వహిస్తున్నా యువతలో ఆశించిన స్థాయిలో మార్పు కనిపించడం లేదు. ఇదే అదునుగా చేసుకొని ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా తమ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు అంతర్రాష్ట్ర గంజాయి ముఠా ఇప్పటికే ప్రయత్నాలు మొదలు పెట్టిందని పోలీసులు పేర్కొంటున్నారు. పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా యువత, కళాశాలల విద్యార్థులే టార్గెట్‌గా ఈ దందా కొనసాగుతున్నది. ఇప్పటికైనా పోలీసు నిఘా విభాగాలు ఈ గంజాయి దందాను నిరోధించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## గంజాయి నియంత్రణకు ప్రత్యేక టీం ఏర్పాటు..

**-జానకీ షర్మిల, ఎస్పీ, నిర్మల్ జిల్లా**

జిల్లా వ్యాప్తంగా గంజాయిని నియంత్రించేందుకు ప్రత్యేకంగా ఒక టీంను ఏర్పాటు చేశాం. 8 మందితో కూడిన ఈ స్పెషల్ టీం గంజాయి రవాణా, క్రయ విక్రయాలు, వినియోగించే వారిపై రహస్యంగా నిఘా ఉంచుతున్నది. గంజాయి సరఫరా చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో గట్టి నిఘా పెడుతున్నాం. నిర్మల్, భైంసా, ఖానాపూర్ తదితర పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. గంజాయి సరఫరా చేసినా విక్రయించినా పోలీసులకు సమాచారం అందించాలి.



గంజాయి రవాణా చేసే నిందితులతో పోలీసులు

# గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం..!

నార్నూర్, ఏప్రిల్ 19 : నిరుపేదల జీవితాల్లో కల్లోలం సృష్టిస్తున్న గంజాయిని పారదోలేందుకు నార్నూర్, గాదిగూడ పోలీసులు ఉక్కుపాదం మోపారు. మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి సాగు, విక్రయం, రవాణాను అడ్డుకునేందుకు నార్నూర్, గాదిగూడ పోలీస్‌స్టేషన్ పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. సీసీఎస్ పోలీస్ బృందంతో నార్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రహీంపాషా, గాదిగూడ ఎస్ఐ మహేశ్, నార్నూర్ ఎస్ఐ రవికిరణ్ కలిసి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గంజాయి సాగు, విక్రేతలకు తమదైన శైలితో కౌన్సెలింగ్ ఇస్తూ, కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తున్నారు. 15 రోజుల్లో పట్టుబడిన వారి వద్ద సుమారు రూ.6 లక్షల విలువైన 20 కిలోల వరకు గంజాయి, ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్‌ని స్వాధీనం చేసుకున్నారు. 10 మందిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మారుమూల గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. దీంతో గంజాయి స్మగ్లర్లు వణికిపోతున్నారు.

## గంజాయి రక్కసిని నిర్మూలిస్తాం

అక్రమంగా మద్యం విక్రయాలు, నాటుసారా తయారీ, గంజాయి రవాణాను అరికట్టేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నాం. నిందితులపై కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తున్నాం. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా మండల కేంద్రాలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గంజాయితో పట్టుబడితే చట్టరీత్యా చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తాం.

**- నాగేందర్(డీఎస్పీ,ఉట్నూర్)**